క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండ


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్: అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆదె మోహన్ పశువుల పాక అగ్ని ప్రమాదంలో దగ్ధం కాగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ నుంచి సాయమందేలా కృషి చేస్తానన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి ప్రధాని నుంచి ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో పదోతరగతి చదువుతున్న కైలాసకోటి మధుహాసిని అనే విద్యార్థినికి ప్రధానమంత్రి మోదీ గురువారం ప్రశంసాపత్రం పంపించారు. గతేడాది గుజరాత్ రాష్ట్రంలో కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ మహోత్సవం జాతీయ సదస్సు నిర్వహించగా, మధుహాసిని హాజరయ్యారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈవో లోకిని శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం మారంపెల్లి అర్జున్ అభినందించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో- ఆర్డినేటర్ అశ్విని అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జగ్గాసాగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలికలకు పలు విషయాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికల చట్టాలు, లింగ వివక్ష, విద్యాలయాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు.బాలికలు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మానస, టెండర్ స్పెషలిస్ట్ గౌతమి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన అధికారులు

పెగడపల్లి: వేసవి కాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ వరుణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం పెగడపల్లి సెక్షన్ పరిధిలోని నామాపూర్, మ్యాక వెంకయ్యపల్లి, రాజారంపల్లి, ఎల్లాపూర్, ల్యాగలమర్రి గ్రామాల్లో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ శేఖర్ రెడ్డి, శంకర్, అసిస్టెంట్ లైన్‌మెన్ ఆనంద్, ప్రజలు పాల్గొన్నారు.

16న జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ సెలెక్షన్

జగిత్యాలటౌన్: ఈనెల 16న జిల్లా స్థాయి బాలబాలికల సబ్ జూనియర్ కబడ్డీ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు 55 కిలోల లోపు బరువు కలిగి ఉండి 1-04-2009 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8978378306 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.



కమనీయం.. భీమేశ్వరుని కల్యాణం

రాయికల్: పట్టణంలోని భీమేశ్వరుని కల్యాణం గురువారం వేకువజామున కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు కల్యాణం తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కథలాపూర్: మండలంలోని తాండ్రాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం గురువారం భక్తజన సందడిలో వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధానవీధుల గుండా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఉత్సవాల్లో శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమం పీఠాధిపతి విశోక తీర్థస్వామి, అర్చకులు సీతారామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ గంగప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, వీడీసీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా రథోత్సవం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్, కొజన్ కొత్తూర్ గ్రామాల్లో మల్లికార్జున జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు రథాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు వీడీసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నాలుగు గంటల నుండే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శుక్రవారంఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య తెలిపారు.

మల్లన్న స్వామి రథోత్సవం

మల్లాపూర్: మండలంలో రత్నాపూర్ లో గురువారం శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు మూడోరోజు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకంతో పాటు పల్లకిసేవను అంగరంగ వైభవంగా అర్చకులు శివకుమార్ నిర్వహించారు. కోరిన కొర్కెలు తీర్చిన స్వామికి భక్తులు పెద్ద సంఖ్యలో నిలువెత్తు బంగారం (బెల్లం)ను ముడుపుగా చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూచన్‌పెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నిరకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించారు. వేడుకల్లో నాయకులు పాల్గొన్నారు.



లలితామాత ఆలయంలో పారాయణం


కళ్యాణిని అభినందిస్తున్న ఆలయ చైర్మన్

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస లోని 108 శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో మాగ పౌర్ణమి పురస్కరించుకుని జగిత్యాల పట్టణానికి చెందిన పూటూరి కల్యాణి ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అశేష భక్తుల సమక్షంలో లలిత మాత సహస్ర పారాయణం చేశారు. దీంతో కల్యాణిని ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చల్లం స్వరూప సత్తయ్య కల్యాణికి అమ్మవారి వస్త్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో పంపటి సులోచన, పెద్ది అశ్విని, చింత రోజ, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం


సమావేశమైన అధికారులు,నాయకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌లపై అభ్యంతరాల గురించి అడిగారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి,రాజ్‌పాల్‌రెడ్డి,గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని 13 ఎంపీటీసీ స్థానాలకు 68 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా తుది జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమం కాంగ్రెస్ నాయకుడు సీహెచ్ విజయభాస్కర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి, సీపీఐ మండలాధ్యక్షుడు ఇరుగురాళ్ల భూమేశ్వర్, బీజేపీ మండలాధ్యక్షుడు గంగల కొమురెల్లి, నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో స్వాతి అధ్యక్షతన మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఎంపీడీవో చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుదిగాం గంగాధర్, టీజేఎస్ జిల్లాకార్యదర్శి చింతకుంట శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధశరత్‌రెడ్డి, బీఎస్పీ నాయకుడు గుజ్జెరి ప్రకాశ్, పాల్గొన్నారు.

కలల సాకారం కోసం కష్టపడి చదవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమేశ్

ధర్మపురి: విద్యార్థులు తమ కలల సాకరం కోసం కష్టపడి చదవాలని సామాజిక సేవకుడు, ఇంపాక్ట్ ట్రైనర్ రేణికుంట రమేశ్ అన్నారు. మండలంలోని మగ్గిడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ .. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని పది మందికి సాయం అందించే స్థాయికి ఎదగాలను సూచించారు. ప్రతీ విద్యార్థి స్వీయ ప్రేరణ కలిగి ఉంటే మంచి విజయాలు సాధించే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోనె రమేశ్, ఉపాధ్యాయులున్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం


మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

గొల్లపల్లి: విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి అన్నారు. గురువారం గొల్లపల్లిలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు అవారి చందుతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, విద్యాసంస్థలు నెలకొల్పి అనేక నిధులు కేటాయించారని, జిల్లాకు మంజూరైన నవోదయ పాఠశాలను ఎంపీ ధర్మపురి అరవింద్ నిజామాబాద్ తరలించాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆవుల సత్యం, మాజీ సర్పంచ్ అలిశెట్టి రవీందర్, లింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ధర్మపురి: బుగ్గారం మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన బండారు చిన్న సత్తమ్మ విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం అందజేశారు.కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్లాగౌడ్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మి, సీఈవో రాజేష్, ఫీల్డు అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సైన్స్ ఫెయిర్


సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: పట్టణంలోని నలంద హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ అలరించింది. విద్యార్థులు వివిధ రకాల విజ్ఞాన ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు సైన్స్ ఫెయిర్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు నాగేంద్ర కుమార్, పద్మ, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు భీమన్న రథోత్సవం

రాయికల్: పట్టణంలోని భీమన్న ఆలయం వద్ద శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దేవుని రాజం, భాగ్యలు తెలిపారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భీమన్న యూత్ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తేదీని మార్చాలి

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తేదీని మార్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అన్నారు. గురువారం మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27న జరుగుతుందని, 26న హిందువులకు అత్యంత ప్రాముఖ్యమైన పండగ మహాశివరాత్రి ఉండటం వల్ల అధిక సంఖ్యలో ఉపవాస దీక్షలో రాత్రంతా జాగరణ చేసి మరుసటి ఉదయమే ఉపవాస దీక్షలు విరమణ చేస్తారని, 27న జరిగే పోలింగ్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

గొల్లపల్లి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేశ్ సహకారంతో మండలంలోని చందోళి గ్రామస్తులు 43 మందికి కంటి ఆపరేషన్ విజయవంతంగా చేశారు. వీరిని లయన్స్ క్లబ్,రేకుర్తి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం బస్సులో పేషంట్లను తీసుకువచ్చి దింపారు. లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి సాయిని నరహరి, వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించటమే నిజమైన దేశభక్తి

కోరుట్ల: భారత రాజ్యాంగాన్ని రక్షించటమే నిజమైన దేశభక్తి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఐ ప్రాంగణంలో గురువారం భారత రాజ్యాంగం, నేటి సమస్యలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కాయన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా ప్రెసిడెంట్ ఇలియాస్ అహమ్మద్ ఖాన్, మహమ్మద్ మసూద్ అలీ, గోపం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవన నిర్మాణం తర్వాతే పాఠశాలను తరలిస్తాం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలానికి మంజూరైన మహాత్మ జ్యోతిబా పూలే (బాలుర) గురుకుల పాఠశాల బీర్‌పూర్ మండలంలో సొంత భవనం లేక కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు మార్చామని, సొంత భవన నిర్మాణం పూర్తయిన తర్వాత తిరిగి బీర్‌పూర్ మండలానికి మార్చుతామని పౌర సమాచార అధికారి వినోద రాణి పేర్కొన్నారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన కాలువ హరీశ్ గురుకుల పాఠశాల తరలింపుపై సమాచారం కోసం సమాచార హక్కు చట్టం కింద జనవరి 15 న దరఖాస్తు చేయగా అధికారి పై విధంగా స్పందించారు. ప్రస్తుతం కోరుట్ల నియోజకవర్గంలో ఐయిలాపూర్‌లో కొనసాగుతోందని, బీర్‌పూర్‌లో సొంత భవనం నిర్మించిన తర్వాత ప్రారంభిస్తామని తెలిపారు.

సత్యేంద్రదాస్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: అయోధ్య రామమందిర ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ మృతి పట్ల సంతాపం తెలిపిన భారత్ సురక్షా సమితి నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. గురువారం జిల్లా కేంద్రంలో సత్యేంద్ర చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, చిట్ల గంగాధర్, బండారి మల్లికార్జున్, రాపర్తి రవి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఇంగ్లిష్ భాషా దినోత్సవం


రాయికల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం

కథలాపూర్: కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఇంగ్లిష్ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రచయిత్రి సరోజిని నాయుడు జయంతి సందర్భంగా ఇంగ్లిష్ బాషా దినోత్సవం నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏడుకొండలు, అశోక్, నీలిమ, లక్ష్మి, రవీందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్, రాయికల్, మైతాపూర్‌లో సరోజిని నాయుడు జయంతి సందర్భంగా గురువారం ఇంగ్లిష్ లాంగ్వేజ్‌డే సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆంగ్ల ఉపాధ్యాయులను సన్మానించారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలని వినతి


డబ్బులు చెల్లించాలని కోరుతున్న రైతులు

సారంగాపూర్: వానాకాలంలో అమ్మిన ధాన్యం డబ్బులు చెల్లించాలని మండలంలోని పోతారం శివారు గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం మరోసారి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సారంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్నామని, యాసంగి వరి నాట్లు పూర్తయినా ఇంకా డబ్బులు చెల్లించలేదని రైతులు వాపోయారు. డబ్బులు కేంద్ర నిర్వాహకులు తమ ఖాతాల్లోకి జమచేసుకున్నారని దీనిపై ఉన్నతాధికారులు 15 రోజుల క్రితం విచారణ జరిపి, సత్వరమే చెల్లింపులు చేస్తామని చెప్పినా ఇప్పటికి రూ. 4 లక్షల వరకు డబ్బులు రావాల్సి ఉందని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్సీ ఈ విషయంపై మరోసారి ఉన్నతాధికారులతో మాట్లాడారు. నిర్వాహకుల నుండి వచ్చిన కొంత మొత్తాన్ని రైతులకు అందించామని, రెండు మూడు రోజుల్లో మొత్తం మంది రైతులకు డబ్బులు చెల్లించేలా చూస్తామని సీఈవో లైశెట్టి శివకుమార్ వివరణ ఇచ్చారు.

హామీలు అమలు చేశాకే ఓట్లడగాలి

• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశాకే పట్టభద్రుల ఓట్లు అడగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. గురువారం ఉదయం జగిత్యాల పట్టణంలోని క్రీడా మైదానాల్లో బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా శ్రావణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌ను కలిసి బిజేపి అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగులు, మేధావులతో పాటు అన్ని వర్గాలను విస్మరించిందన్నారు. ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివం, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, నాయకులు సిరికొండ రాజన్న, జున్ను రాజేందర్, ఇట్నేని రమేష్, దశరథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీ,ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

మల్యాల: డీసీఎం వ్యాన్ ఎదురుగా వస్తున్న బియ్యం లోడు లారీని ఢీకొని, ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడగా, భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇండోర్ నుంచి విజయవాడ వెళ్తున్న డీసీఎం వ్యాన్ గురువారం సాయంత్రం మల్యాల మండలం అడ్డరోడ్డు వద్ద రాగానే బియ్యం లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొంది.వెంటనే కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కూడా ఢీకొంది. ఈ సంఘటనలో డీసీఎం వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, డీసీఎం వ్యాన్ డ్రైవర్ దీపక్ మీనా గాయపడ్డాడు. లారీలోని బియ్యం బస్తాలు రోడ్డుపై పడడంతో రోడ్డంతా బియ్యం అయ్యాయి. సుమారు అరగంటకుపైగా రోడ్డుపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.వాహనం అజాగ్రత్తగా నడిపిన వ్యాన్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.